సాక్షి అనకాపల్లి

గురువారం । 12 । అక్టోబర్ । 2023





కశింకోట మండలం నూతలగుంటపాలెం, రోలుగుంట మండలం జె.నాయుడుపాలెంలో బీపీ, రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్య సురక్ష @71,440

స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. బుధవారం జిల్లావ్యాప్తంగా 20 ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేశారు. 5,313 మందికి ఓపీ సేవలందించారు. వీరిలో 194 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సెప్టెంబర్ 30న ప్రారంభించినప్పటి నుంచి బుధవారం వరకు మొత్తం 71,440 మందికి ఉచిత వైద్యసేవలందించారు. వీరిలో 30 వేల మంది మహిళలున్నారు.

– సాక్షి, అనకాపల్లి

జగనన్నకు చెబుదాం.. సమస్యలన్నీ పరిష్కరిద్దాం

- నెల రోజుల్లో అర్జీలకు పరిష్కారం– అధికారులకు కలెక్టర్ సూచన

8లో



న్యూస్‌రీల్

16 నుంచి ఈవీఎంల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి టౌన్: ఈనెల 16వ తేదీ నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, కంట్రోల్ యూనిట్ల పరిశీలన జరుగుతుందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఒకరు చొప్పున హాజరు కావచ్చని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈనెల 16వ నుంచి ఈవీఎంలు, వీవీపేట్లు, ఫస్ట్‌లెవెల్ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సీ) చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు కంట్రోల్ యూనిట్లు ఏ విధంగా పని చేస్తున్నాయో బెల్ ఇంజనీర్లు ప్రదర్శిస్తారని చెప్పారు. పర్యవేక్షక అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారన్నారు. ఎస్పీ కార్యాలయం వద్ద గల గొడౌన్‌లో కట్టుదిట్టమైన భద్రత మధ్య పరిశీలన జరుగుతుందన్నారు. ఈ తనిఖీ సుమారు 30 రోజుల వరకు ఉంటుందన్నారు. ఈ తనిఖీకి హాజరయ్యే రాజకీయపార్టీల ప్రతినిధుల పేర్లను వెంటనే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, డీటీ రవికుమార్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ముందు వీవోఏలు చేపట్టిన 36 గంటల దీక్ష బుధవారం ముగిసింది. ఈ ధర్నాలో అధిక సంఖ్యలో వీవోఏలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పరవాడ మండలం ధర్మారాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా యోగా జట్ల ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. అండర్–17 విభాగంలో పి.పవన్‌కుమార్ ప్రథమ, పి.ప్రశాంత్ తృతీయ, పి.క్రాంతిసాగర్ ఐదవ స్థానంలో నిలిచారు. వీరు ముగ్గురూ ఈ నెల 28న పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జెడ్పీ హైస్కూల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం ఏవీ జగన్నాథరావు బుధవారం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ ముర్రు సూర్యనారాయణలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.రామారావు, సర్పంచ్ శిరిసోళ్ల గంగాభవాని, మాజీ సర్పంచ్ ఎస్.ఆదిగణపతినాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

● సొంతింటి కల.. నెరవేరిన వేళ

నేడే స్వగృహ ప్రవేశం



గృహ ప్రవేశ ఆహ్వానపత్రిక



స్థలం : పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామం
సమయం : అక్టోబర్ 12వ తేదీ ఉదయం 9 గంటలకు
ఆహ్వానించువారు : 173 పేద కుటుంబాలు
ప్రారంభోత్సవం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా..
బంధుమిత్రులు : మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు

అనకాపల్లి జిల్లా ప్రజలందరికీ ఇదే మా ఆహ్వానం.. ఇన్నాళ్లూ.. సొంత ఇల్లు లేక కుటుంబాలతో అనేక ఇబ్బందులు పడిన మాకు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గూడు కల్పించింది. కలల సౌధాన్ని నిర్మించుకొనే బృహత్తర అవకాశాన్ని అందించింది. ఇంటి స్థలం నుంచి.. నిర్మాణం పూర్తయ్యేంత వరకూ ప్రభుత్వం చేదోడువాదోడుగా నిలుస్తూ.. మా సొంతింటి కలని సాకారం చేసింది. బాడుగలు కట్టుకోలేక.. సంపాదన సరిపోక.. కుటుంబ పోషణే కష్టమవుతున్న మాకు.. కలలో కూడా ఊహించని ఇంటిని ఆస్తిగా సీఎం వైఎస్ జగన్ అందించారు. ఈ సంతోష సమయంలో.. మేమంతా సామూహిక గృహ ప్రవేశాలకు మిమ్మల్నందర్నీ ఆహ్వానం పలుకుతున్నాం. గురువారం మంచి ముహూర్తం ఉంది కాబట్టి.. ఆ రోజునే మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా అందిస్తున్న ఆశీస్సులతో సామూహిక గృహ ప్రవేశాలు చేస్తున్నాం. పేద మనసుల ఆహ్వానాన్ని మన్నించి.. మీరంతా వచ్చి ఆశీర్వాదం అందించాలని కోరుతున్నాం.



- 173 ఇళ్లల్లో గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు
- సుందరంగా పరవాడ జగనన్న కాలనీ

పరవాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సామూహిక గృహ ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 5 లక్షల గృహప్రవేశాలు గురువారం జరగనున్నాయి. అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని.. నిర్మాణ పనులను వేగవంతం చేశారు. మోడల్ కాలనీగా పరవాడ మండలం పరవాడ, వెన్నెలపాలెం కాలనీలను ఎంపిక చేశారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాలకు సంబంధించిన పనులపై ఆరా తీశారు. గృహ నిర్మాణశాఖ ఏఈ ఎం.ఎస్.ఎన్.రెడ్డి పర్యవేక్షణలో నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. ప్రభుత్వం పరవాడ మండలంలో 8 జగనన్న లేఅవుట్లలో 871 గృహాలను మంజూరు చేసింది. వాటిలో 360 గృహాలు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పరవాడ–1 లేఅవుట్ పరిధిలోని పరవాడ, వెన్నెలపాలెంలో బడుగు బలహీన వర్గాల వారికి 292 మంది గృహాలు మంజూరు చేయగా వాటిలో 173 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. గురువారం వాటినే సీఎం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, హౌసింగ్ జిల్లా అధికారి కె.రమామణి, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటున్నారు.

సకల సదుపాయాలతో ఇళ్ల నిర్మాణం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేశారు. పూర్తయిన గృహాలకు పెయింటింగ్స్ కూడా పూర్తి చేశారు. సామూహిక గృహ ప్రవేశాల రోజున లబ్ధిదారులకు తాళాలు కూడా అందజేయనున్నారు. జగనన్న కాలనీల్లో ఇంటింటికీ తాగునీరు అందించే బాధ్యతను నీటి సరఫరా విభాగం, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చే పనిలో ఈపీడీసీఎల్, కాలనీల్లో అంతర్గత రహదారులు, కాలువల నిర్మాణం ఇతర పనుల బాధ్యతల్ని వీఎంఆర్‌డీఏ, పంచాయతీరాజ్ విభాగాలకు అప్పగించగా.. అన్ని పనులను నిర్దిష్ట సమయంలోనే పూర్తి చేశారు.

తారువలో తీరనున్న విద్యుత్ కష్టాలు

- రూ. 3.5 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి
- టెక్నికల్ చార్జింగ్ టెస్ట్ నిర్వహించిన విద్యుత్‌శాఖ అధికారులు



తారువ విద్యుత్ ఉప కేంద్రంలో టెక్నికల్ చార్జింగ్ టెస్ట్ చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

దేవరాపల్లి: తారువలో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులు ఆఖరి దశకు చేరుకోవడంతో విద్యుత్ శాఖ (ఏపీఈపీడీసీఎల్) అధికారులు బుధవారం టెక్నికల్ చార్జింగ్ టెస్ట్ నిర్వహించారు. దశాబ్దాలుగా తారువ పరిసర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ కష్టాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో నిర్మాణం చేపట్టిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు దాదాపుగా ఆఖరి దశకు చేరుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే టెక్నికల్ చార్జింగ్ టెస్ట్ నిర్వహించిన అధికారులు సబ్‌స్టేషన్ పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ సబ్‌స్టేషన్‌తో తారువతో పాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు స్పష్టం చేశారు. విశాఖపట్నం ఎస్‌ఈ ఆపరేషన్స్ ఎల్.మహేంద్రనాథ్, ఈఈ ట్రాన్స్‌ఫార్మర్ ఎం.శ్రీనివాసరావు, జిల్లా ఈఈ మీటర్ ప్రొటెక్షన్ చెల్లుబాబు, వివిధ విభాగాల ఈఈలు ఎం. సత్యారావు, పి. వేణుగోపాల్, యు.గౌరీప్రసాద్, స్థానిక ఏఈ కె. శంకరరావు తదితర విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్య పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ దృష్టికి మెరక గ్రామాల విద్యుత్ సమస్య
- గొడిచర్ల సందర్శించిన అధికారుల బృందం

నక్కపల్లి : మండలంలో 18 మెరక గ్రామాల ప్రజలు దశాబ్ద కాలం నుంచి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చొరవతో జిల్లా అధికార యంత్రాంగం కదిలి వచ్చింది. గొడిచర్ల అవతల ఉన్న 18 మెరక గ్రామాల వారు తీవ్రమైన విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాలకు సుదూరాన ఉన్న అప్పలరాజుపేట నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. తరుచూ విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురై తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. తాజాగా మంగళవారం రాత్రంతా స్థానికులు విద్యుత్ లేక చీకట్లో మగ్గారు. దీనిపై పలుమార్లు కలెక్టర్ కార్యాలయానికి, ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గ్రామస్తులు బుధవారం ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణను కలిసి సమస్యను వివరించగా ఆయన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ద్వారా జిల్లా కలెక్టర్ రవిపటాన్‌శెట్టి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ వెంటనే ట్రాన్స్‌కో అధికారులను అప్రమత్తం చేసి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాజశేఖర్ నాయకత్వంలో జిల్లా ఉన్నతాధికారుల బృందం గొడిచర్ల తరలి వచ్చి మెరక గ్రామాల ప్రజలతో చర్చించింది. వీసం రామకృష్ణతో పాటు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ మాట్లాడుతూ గొడిచర్లలో గత ప్రభుత్వం సబ్ స్టేషన్ నిర్మించినప్పటికీ మెరక గ్రామాల వారికి ఇక్కడ నుంచి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయలేదన్నారు.

గొడిచర్లకు మెరక గ్రామాలకు మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో ట్రాక్ మీదుగా లైన్లు వేయడానికి రైల్వే శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. అండర్‌గ్రౌండ్ కేబుల్ వేసి జగన్నాథపురం, దొంకాడ, రేబాక, కొత్తూరు, రమణయ్యపేట, దోసలపాడు, చీడిక, కొత్తూరు, సీతానగరం గుల్లిపాడు, రేవళ్లు, తదితర గ్రామాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. దీంతో అధికారుల బృందం రైల్వే ట్రాక్ పరిసరాలను పరిశీలించింది.



కేబుల్ ఏర్పాటు చేయాల్సిన రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

ట్రాక్ అవతలకు విద్యుత్ లైను ఏవిధంగా ఏర్పాటు చేయాలనే దానిపై చర్చించారు. త్వరలోనే రైల్వే శాఖ అనుమతులు తీసుకుని మెరక గ్రామాల వారికి నిరంతర విద్యుత్ సదుపాయం అందించడానికి చర్యలు తీసుకుంటామని, దీనిపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో ఏఈ కృష్ణ పాల్గొన్నారు.

వీరభద్రుడి భూములకు దిక్కేది?

- రూ.4 కోట్ల విలువైన స్థలం దురాక్రమణ
- హెచ్చరిక బోర్డు తొలగించి కర్రల డిపో ఏర్పాటు
- ఆలయ భూముల పరిరక్షణ ఆర్డినెన్స్‌ను పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పట్టణంలో దేవుడి భూములపైనే కన్నేసి కాజేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎంతో చరిత్ర గల వీరభద్రస్వామి ఆలయ భూములు వరుసగా అన్యాక్రాంతమవుతున్నాయి. తాజాగా పట్టణ నడిబొడ్డున రూ.4 కోట్లు విలువ చేసే సుమారు 20 సెంట్ల ఆలయ భూమి దురాక్రమణకు గురైంది. దేవదాయ, ధర్మాదాయశాఖ పరిధిలో వున్న భూముల పరిరక్షణకు రెండు నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌ను కూడా జారీ చేసింది. ఎవరైనా ఆలయ భూములను ఆక్రమించుకుంటే వారిపై చర్యలు తీసుకుని భూములను స్వాధీనపరచుకునే విధంగా ఎండోమెంట్ శాఖకు ఈ ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం విశేష అధికారులు కల్పించింది. కానీ ఆ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఆక్రమణదారులతో చేతులు కలిపి జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇవ్వడంతో విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. యలమంచిలి పట్టణం నడిబొడ్డున సర్వే నెంబరు 164లో వున్న 20 సెంట్ల వీరభద్రస్వామి ఆలయ భూమి విలువ ప్రస్తుత మార్కెట్ రేట్ల ప్రకారం సెంటు రూ.20 లక్షల వరకు ఉంటుంది. విలువైన స్థలం కళ్ల ముందే అన్యాక్రాంతమవుతున్నా స్థానిక అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారనే ఆక్షేపణలు విన్పిస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కన ప్రాంతీయ పశువుల ఆస్పత్రి ఎదురుగా వున్న ఖరీదైన ఈ స్థలంలో కూనిశెట్టి సత్యవతి ఆక్రమణదారుగా ఉన్నట్టు ఎండోమెంట్స్ రికార్డుల్లో వుంది. ఈ భూమికి సంబంధించి ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు కూడా ఆ శాఖకే అనుకూలంగా ఉన్నప్పటికీ ఈ స్థలాన్ని కాపాడుకునే దిశగా అధికారులు కనీస చర్యలు కూడా చేపట్టకపోవడం గమనార్హం.



సర్వే నంబరు 164లో వీరభద్రుని ఆలయ స్థలంలో ఏర్పాటు చేసిన కర్రల డిపో

కర్రల డిపో ఏర్పాటు

ప్రస్తుతం ఈ 20 సెంట్ల వీరభద్రస్వామి ఆలయ స్థలంలో కొత్తగా ఒక కర్రల డిపో ఏర్పాటైంది. ఈ స్థలంలో ఉన్న దేవదాయ శాఖ హెచ్చరిక బోర్డు తొలగించి దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. ఏడాది క్రితం ఇదే స్థలంలో ఒకరు చికెన్ సెంటర్ పెట్టేందుకు ప్రయత్నించగా, పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు అడ్డుకున్నారు. ఇప్పుడు రూ.4 కోట్ల విలువ చేసే 20 సెంట్ల స్థలం ఆక్రమణదారుల చెరలో చేరిపోయినా అడ్డుకునే నాథులు కరువయ్యారు.

మొదటి నుంచీ ఆక్రమణలే

యలమంచిలి పట్టణంలో పలుచోట్ల వీరభద్రస్వామి ఆలయ భూములున్నాయి. క్రమేపీ ఈ భూములన్నీ ఆక్రమణలకు గురవుతున్నాయి. సర్వే నెంబరు 164లో 2.98 ఎకరాలు, సర్వే నెంబరు 62/1లో 6.25 ఎకరాల వీరభద్రస్వామి భూములు దురాక్రమణలకు గురవుతూనే వున్నాయి. 6.25 ఎకరాల ఆలయ భూముల్లో 101 మందిని ఆక్రమణదారులుగా గుర్తించారు. వీరంతా ఆ స్థలాల్లో శాశ్వత కట్టడాలు నిర్మించుకున్నారు. కొన్ని ఖాళీ స్థలాలున్నప్పటికీ దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో అవి కూడా క్రమంగా ఆక్రమణదారుల గుప్పెట్లోకి వెళ్లిపోయాయి. ఆక్రమణకు గురైన వీరభద్రుని భూముల విలువ ప్రస్తుత మార్కెట్ ప్రకారం దాదాపు రూ.120 కోట్లు పైనే ఉంటుందని చెబుతున్నారు.

కర్రల డిపో తొలగిస్తాం



వీరభద్రస్వామి ఆలయ స్థలంలో ఏర్పాటు చేసిన కర్రల డిపోను తొలగిస్తాం. ఇప్పటికే ఆక్రమణదారుడిని పిలిచి కర్రల డిపో తీసేయమని చెప్పాం. కానీ తొలగించలేదు. దేవదాయ భూములు ఆక్రమించుకున్నా, చేతులు మారినా ఎవరికీ సొంతం కావు. దేవదాయ శాఖ చట్టాల ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ఇక మిగిలిన ఆక్రమణలను కూడా దశల వారీగా తొలగించి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు చేపడతాం.

–టి.సాంబశివరావు, వీరభద్రస్వామి ఆలయం ఈవో

ఏడాది ప్రాయంలోనే అద్భుత గ్రాహకశక్తి



- నోబెల్ వరల్డ్ రికార్డ్సులో దృశ్యంత్‌కు చోటు

కశింకోట : ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన గాలి దృశ్యంత్‌కుమార్ బుడి బుడి అడుగుల నాడే అద్భుతమైన గ్రాహక శక్తితో నోబెల్ ప్రపంచ రికార్డు సాధించి అందరిని అబ్బుర పరిచాడు. తమిళనాడుకు చెందిన నోబెల్ వరల్డ్ రికార్డ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ విషయాన్ని తండ్రి గాలి నాగేశ్వరరావు ఇక్కడ బుధవారం విలేకరులకు తెలిపారు. నాగేశ్వరరావు, శ్రీదేవి దంపతుల కుమారుడైన దృశ్యంత్ కుమార్ పుట్టినప్పటి నుంచి చురుగ్గా ఉండడమే కాకుండా అపరిమితమైన గ్రాహక శక్తి ఉన్నట్టు తల్లిదండ్రులు గుర్తించారు. పది నెలల వయస్సు నుంచి కుమార్‌కు అనేక రకాల వస్తువులు, ఫొటోలు, వివిధ దేశాల జెండాలను చూపిస్తూ అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో దృశ్యంత్ ఏడాది వయసులోనే 300 రకాల ఫొటోలను గుర్తించడమే కాకుండా వస్తువులు, పూలు, పండ్లు, కూరగాయలను సునాయాసంగా గుర్తిస్తున్నాడు. దీంతో తల్లిదండ్రులు తమ కుమారుని గ్రాహక శక్తిని వీడియో ద్వారా రికార్డు చేసి తమిళనాడులో ఉన్న నోబుల్ వరల్డ్ రికార్డ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు ఇటీవల పంపించారు. వాటిని పరిశీలించిన ప్రతినిధులు ఉగ్గినపాలెం వచ్చి పరిశీలించిన మీదట నోబెల్ వరల్డ్ రికార్డులో నమోదు చేసి పురస్కారాన్ని ప్రకటించారు. సర్టిఫికెట్, పతకాన్ని అందిస్తూ పోస్టు ద్వారా ఇక్కడకు పంపారు.



దృశ్యంత్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి (ఇన్‌సెట్) దృశ్యంత్‌కుమార్

ఎంపీ డాక్టర్ సత్యవతి అభినందన

చిన్నతనంలోనే అద్భుతాలు చేస్తున్న దృశ్యంత్ కుమార్‌కు అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీశెట్టి వెంకట సత్యవతి తన కార్యాలయంలో బుధవారం జ్ఞాపికను అందజేసి సత్కరించి కొద్దిసేపు ముచ్చటించి అభినందించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను కూడా సత్కరించారు. ఈ చిన్నారి మరిన్ని అద్భుతాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలవగలడని ఆకాంక్షించారు. డాక్టర్ కె. విష్ణుమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏఎస్ఐ కుమారుడికి కారుణ్య నియామకం



ఓంవెంకటనాథ్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: అనారోగ్య కారణాలతో మరణించిన ఏఎస్ఐ కుమారుడికి కారుణ్య నియామకాల్లో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా నియామకపత్రాన్ని అందించినట్లు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. ఆర్.తులసీనాథ్ విశాఖ సీసీఎస్‌లో ఏఎస్ఐగా పని చేస్తూ 2021లో అనారోగ్యంతో మరణించారు. అతని కుమారుడు ఓంవెంకటనాథ్‌కు బుధవారం ఎస్పీ తన కార్యాలయంలో నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన)బి.విజయభాస్కర్, ఏవో(అడ్మిన్) బి.శారద, సూపరింటెండెంట్ విజయకుమార్, సీనియర్ అసిస్టెంట్లు బాలు, నాయుడు పాల్గొన్నారు.

కారు, బైకు ఢీ.. ఒకరికి గాయాలు

కోటవురట్ల: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డు మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, బైకు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న కూనిశెట్టి రాజు కాలు విరిగిపోయింది. వెంటనే అతనిని 108లో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు మధ్యలో కారు ముందు భాగం దెబ్బతిని, టైర్ పంక్చర్ కావడంతో ఇరుపక్కల ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ సహాయంతో కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జగనన్నకు చెబుదాం.. సమస్యలన్నీ పరిష్కరిద్దాం

- నెల రోజుల్లో అర్జీలకు పరిష్కారం- అధికారులకు కలెక్టర్ సూచన
- ఎస్.రాయవరం శిబిరంలో 358 అర్జీలు

కోటవురట్ల: ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపిస్తూనే, సంక్షేమ పథకాల అమలులో సంతృప్తి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. ఎస్.రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, నర్సీపట్నం అడిషనల్ ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఆర్డీవో జయరాం ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు విన్నారు. స్వీకరించిన అర్జీలకు నెలరోజుల్లో పరిష్కారం చూపాలని ఆయా శాఖలకు ఆదేశాలిచ్చారు. శిబిరంలో జిల్లా స్థాయి అధికారులంతా అందుబాటులో ఉండి, మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపారు. అర్జీదారులెవరూ అసంతృప్తితో వెళ్లకూడదని, ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రజలు తిరిగే పనిలేకుండా జిల్లా యంత్రాంగం ప్రజల ముంగిటకే వచ్చి పరిష్కారం చూపుతోందని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోనలోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కొణతాల ఈశ్వరరావు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

20 కౌంటర్లు ఏర్పాటు..

అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా 20 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఏ సమస్యపై దరఖాస్తు ఇస్తున్నారు? ఎక్కడ అర్జీ ఇవ్వాలి? తదితర సమాచారం కోసం దరఖాస్తుల విచారణ విభాగం, దరఖాస్తు చేయలేనివారికి సహాయపడేలా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బంది అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ శిబిరంలో వివిధ సమస్యలపై 358 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



జగనన్నకు చెబుదాంలో సమస్య వింటున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, జేసీ జాహ్నవి



నవధాన్యాల స్టాల్ వద్ద వ్యవసాయ శాఖ సిబ్బంది

నవధాన్యాల సాగు.. నేలతల్లికి బాగు

సమస్యల పరిష్కారానికి వచ్చేవారు ఎక్కువగా రైతులే ఉంటారన్న ఆలోచనతో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది. ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం కలిగిస్తూ నవధాన్యాల సాగు.. నేలతల్లికి బాగు అంటూ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. నవధాన్యాలు, చిరుధాన్యాల సాగు, వరుసలో వరిసాగు, సామూహికంగా కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, జీవామృతం, వేప కషాయాలను ప్రదర్శించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బాబూరావు

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కలిశారు. ప్రజలు అందించిన దరఖాస్తులన్నీ సత్వరమే పరిష్కరించాలని కోరారు. దరఖాస్తు ఇచ్చిన ప్రతి ఒక్కరూ సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. కొన్ని గ్రామాల్లో రహదారులు బాగాలేవని, వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

కాలువను అభివృద్ధి చేయండి

ఏటికొప్పాక వరాహనది నుంచి సైతారుపేట ఇరిగేషన్ కాలువ పూడికలతో నిండిపోయింది. దీంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఈ కాలువను అభివృద్ధి చేస్తే సైతారుపేట, సర్వసిద్ధి, పేటసూదిపురం, కృష్ణాపురం, పోతిరెడ్డిపాలెం, వేమగిరి ప్రాంత రైతాంగానికి మేలు జరుగుతుంది. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.



– వీసం శ్రీరాములు, వీసం అప్పలస్వామి, వీసం వెంకటరమణ, రైతులు, సైతారుపేట

శ్మశాన వాటికను ఆక్రమించేశారు

గుర్రాజుపేట సర్వే నెం.98లో 1.60 ఎకరాలు అక్రమణకు గురైందని ఎస్సీ, ఎస్టీలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం ఈ స్థలాన్ని కేటాయించిందని, ఇటీవల కొందరు వ్యక్తులు అక్రమించుకుని, శ్మశాన వాటికకు రాకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి శ్మశాన వాటికను అప్పగించాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన తెలిపారు.



తూర్పుకాపులకు బీసీ-డి సర్టిఫికెట్లు ఇవ్వండి

తూర్పు కాపులకు బీసీ-డి సర్టిఫికెట్లు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించుకోవట్లేదు. అర్హత కలిగిన వారందరికీ తూర్పుకాపు ధ్రువీకరణ పత్రాలు అందించాలి. దీనిపైనే కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాం.

– తుమ్మపాల నాగమురళీకృష్ణ, తూర్పుకాపు సంఘ ప్రతినిధి

విద్యార్థి మృతి ఘటనలో మరో ముగ్గురికి బాధ్యత

- శాఖాపరమైన చర్యలకు సిఫార్సు
- విచారణాధికారి ఆర్డీవో జయరాం వెల్లడి



విచారణ నిర్వహిస్తున్న ఆర్డీవో జయరాం, డీఈవో వెంకటలక్ష్మమ్మ

పాయకరావుపేట: పాయకరావుపేట దుర్గానగర్ పాఠశాలలలో శ్లాబ్ పలక పడి విద్యార్థి మరణించిన సంఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో జయరాం, డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం పాఠశాల వద్ద విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.ఎస్.గాంధీ వ్యవహార శైలిపై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పంతా హెచ్ఎంపై నెట్టేసే ప్రయత్నాలు చేయొద్దని, ఎంఈవోగా అన్ని పాఠశాలల్లో నాడు నేడు పనులు పర్యవేక్షించే బాధ్యత మీపై ఉందని స్పష్టం చేశారు. విచారణ సమయంలో స్థానికులు, బాధిత కుటుంబీకులు, ఎంపీటీసీ రమాకుమారి తదితరులు హాజరై కేవలం హెచ్ఎంను మాత్రమే బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేయడం తగదన్నారు. ఎంఈవోతోపాటు, రెండునెలల క్రితం బదిలీపై వెళ్లిన హెచ్ఎం, పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వీరందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని ఆర్డీవో చెప్పారు. తక్షణ సాయం కింద రూ.2 లక్షల చెక్కు తీసుకువచ్చామని, సీఎం సహాయ నిధి నుంచి మరో రూ.5 లక్షలు చెల్లించాలని విచారణ కమిటీ సిఫార్సు చేస్తుందని ఆర్డీవో చెప్పారు. మృతుడి తండ్రి లేదా తల్లికి ఉద్యోగం ఇవ్వాలని సిఫార్సు చేస్తామన్నారు. తక్షణ సాయం రెండు లక్షలు తీసుకోడానికి మృతుడి కుటుంబీకులు, స్థానికులు నిరాకరించారు.

గురునాథరావు సేవలు మరువలేనివి



పేదలకు వస్త్రాలు, దుప్పట్లు అందిస్తున్న బొడ్డేడ ప్రసాద్, జానకీరామరాజు



గురునాథరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిక్కాల రామారావు

అనకాపల్లిటౌన్: మాజీ మంత్రి, స్వర్గీయ గుడివాడ గురునాథరావు పోరాట యోధుడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన గురునాథరావు 68వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో గురునాథరావు సభ ఉందంటే ప్రజలు పరుగులు తీసేవారని, ఆయన ప్రసంగం వినేందుకు ఆసక్తిగా నిరీక్షించేవారన్నారు. ఆయన సభలు, సమావేశాలంటే ప్రతిపక్షాలకు వెన్నులో వణుకు మొదలయ్యేదని గుర్తు చేశారు. ఆయన తనయుడు అమర్‌నాథ్ తండ్రి నాయకత్వాన్ని అందిపుచ్చుకుని రాష్ట్ర స్థాయికి ఎదిగారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, దేవస్థానాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు, ఆళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ఉమ్మడి రాష్ట్రంలో స్వర్గీయ గురునాథరావు సేవలు మరువలేనివని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. గురునాథరావు జయంతి సందర్భంగా మండలంలోని ఎం.ఎస్.పేటలో గురునాథరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళిలర్పించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ గురునాథరావు తనయుడు అమర్‌నాథ్ రాష్ట్ర మంత్రిగా ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, సర్పంచ్‌లు గెడ్డమూరి శ్రీనివాస్, సకిలేటి రాము, పన్నీరు బాబ్జి, గోసల కృష్ణ, ఎంపీటీసీలు కొంతం నరేష్, యాగదాసు శేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమంతో పాటు, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. ఏఎస్ పేటలో మీడియాతో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజలందరి ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామాల్లో కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తారన్నారు. దేశంలో ఎక్కడా లేనంతగా సంక్షేమం, అభివృద్ధి చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ నెల 9 న విజయవాడలో జరిగిన సమావేశంలో జగనన్న ఆదేశం మేరకు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు.

బ్రాండిక్స్‌తో ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను చూపుతున్న ఇరు సంస్థల ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ ఇండియాతో అచ్యుతాపురం ప్రశాంతి విద్యా సంస్థలు బుధవారం ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రెండు సంస్థలకు చెందిన ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతి విద్యా సంస్థల కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ బ్రాండిక్స్ అపెరల్ ఇండియా సహకారంతో తమ విద్యా సంస్థలో ఇంటర్మీడియట్ ఫ్యాషన్, గార్మెంట్ మేకింగ్ కోర్సుని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రెండేళ్ల వ్యవధిగల ఈ కోర్సులో చివరి నాలుగు నెలలు స్టైఫండ్, అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు




పీకే గూడెం వద్ద బైక్‌లు ఢీకొని సంఘటన స్థలంలో గాయాలతో పడివున్న యువకులు

నాతవరం: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నాతవరం పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండ ధర్మవరం గ్రామానికి చెందిన గూటాల సోమ్, వి.సతీష్, ఎస్.నూకరాజు ముగ్గురూ బైక్‌పై పి.జగ్గంపేట గ్రామం వైపు వెళ్తున్నారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన అంకంరెడ్డి రాజు పి.జగ్గంపేట నుంచి వస్తుండగా పీకే గూడెం వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గూటాల సోమ్, అంకంరెడ్డి రాజులకు కాళ్లు విరిగిపోయి, తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ప్రమాదంలో రెండు బైక్‌లు తుక్కుతుక్కయ్యాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సపర్యలు చేసి, ఆస్పత్రికి తరలించారు. గూటాల సతీష్ కాకినాడలో, అంకంరెడ్డి రాజు నర్సీపట్నం ప్రవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో పాడైన బైక్‌లను స్టేషన్‌కు తరలించామని, ఇంకా కేసు నమోదు చేయాలేదని హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు వెల్లడించారు.

గ్రామంలో నివాసం ఉండగా నోటీసులిస్తారా?

- బీఎల్వోపై చర్యలకు మెలిపాక సర్పంచ్ డిమాండ్



బీఎల్‌వో తనకు పంపిన నోటీసును చూపుతున్న మెలిపాక సర్పంచ్ విజయభాస్కరరాజు

మునగపాక: తాను నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా సేవలందిస్తుంటే బీఎల్వో ప్రవీణ తాను గ్రామంలో లేనంటూ తనకు నోటీసు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని మెలిపాక సర్పంచ్ అయినంపూడి విజయభాస్కరరాజు ప్రశ్నించారు. సర్పంచ్ స్థానికంగా నివాసం లేరంటూ బీఎల్వో బుధవారం నోటీసు ఇచ్చారు. దీనిపై విజయభాస్కరరాజు స్పందించారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన కొంతమంది తాను గ్రామంలో నివాసం లేనంటూ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టకుండా నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. బీఎల్వోలు తమకు వచ్చిన ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాల్సి ఉండగా కేవలం ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా ప్రవర్తించడం సరికాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన వారి మాటలు నమ్మి, తప్పుడు నోటీసులు అందించిన బీఎల్వోపై చర్యలు తీసుకోవాలని విజయభాస్కరరాజు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు వెదురుపర్తిలో 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం

కశింకోట: మండలంలోని వెదురుపర్తి సచివాలయంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ప్రత్యేక వైద్యులు, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు శిబిరంలో వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు అవసరమైన వారికి నిర్వహించిన ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని వెదురుపర్తి సచివాలయ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరుంధతినగర్‌లో..

అనకాపల్లిటౌన్: గవరపాలెం అరుంధతినగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జెడ్పీ సుర వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కూడా వైద్య సేవలు పొందవచ్చన్నారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని, కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం నేడు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని గురువారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. అనంతరం వెదురుపర్తిలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



కుండ్ల ఇందిరకు బీమా నగదు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమేష్

కశింకోట: కశింకోట పంచాయతీ కార్యాలయం పరిధిలో బుధవారం మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని కార్యదర్శి ఎన్.రమేష్ అందజేశారు. కుండ్ల అప్పలరాజు మృతి చెందడంతో అతడి భార్య ఇందిరకు తక్షణ సాయంగా రూ.10 వేల నగదు అందించారు. బాలికల హైస్కూల్ పేరంట్స్ కమిటీ అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మహామృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్: మండలంలోని బట్లపూడిలో గల సోహం ఆశ్రమంలో లోకకల్యాణార్థం నిర్వహించిన మహామృత్యుంజయ హోమం బుధవారంతో ముగిసిందని ఆశ్రమ నిర్వాహకుడు రవి చెప్పారు. గురువారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆశ్రమంలో 90 రోజులపాటు హోమం జరిపామని ఆయన తెలిపారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు



పెరుగుబజార్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న రవికృష్ణంరాజు

అనకాపల్లిటౌన్: జోన్ పరిధిలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ రవికృష్ణంరాజు ఆదేశించారు. స్థానిక పెరుగుబజార్- గాంధీబొమ్మ జంక్షన్ రహదారి విస్తరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా రహదారి విస్తరణకు స్థానిక ప్రజలు ప్రభుత్వానికి సహకరించడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి డ్రైనేజీ, రహదారి విస్తరణ పనులు పూర్తిచేస్తామని చెప్పారు. ఎక్కడైన చిన్న చిన్న సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. పట్టణంలో వివిధ రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు రవికృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ చిరంజీవి, ఏఈ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు వైద్య సేవలు



రోగులకు సేవలందిస్తున్న వైద్యురాలు మనీషా



మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

- నూతలగుంటపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన
- 428 మందికి వైద్య సేవలు

కశింకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకు ఉచితంగా వైద్య సేవలు చేరాయి. మండలంలోని శివారున ఉన్న నూతలగుంటపాలెం సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఐదు గ్రామాల నుంచి సుమారు 428 మంది ప్రజలు హాజరై ఉచిత వైద్య సేవలు పొందారు. వీరిలో 76 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 63 మందికి కళ్లద్దాలు అందజేశారు. 13 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 76 మందికి బీపీ పరీక్షలు, 31 మందికి సుగర్ పరీక్షలు జరిపారు. ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో స్పాట్ రిజిస్ట్రేషన్, ఇంటింటి సర్వేలో గుర్తించిన వారికి, రక్త పరీక్షలు నిర్వహించడానికి వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. గదుల్లో ప్రత్యేక వైద్య నిపుణులు రవితేజ, ఎ.ప్రసాద్, పీహెచ్‌సీల వైద్యులు ఎ.మనీషా, ఎస్.తిరుపతిరావు రోగులను పరీక్షించి అవసరమైన వారికి రక్త, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఆప్తాలమిక్ నిపుణుడు పవన్‌కల్యాణ్ కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, కంటి శస్త్రచికిత్సలు జరపడానికి సిఫార్స్ చేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు శిబిరాన్ని ఆద్యంతం పరిశీలించి వైద్య సేవలందుతున్న తీరును పర్యవేక్షించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య పోషణ కిట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల పండ్లు ప్రదర్శించి బాలింతలు, గర్భిణులకు వాటిపై అవగాహన కలిపించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా సహజ సిద్ధంగా పండించిన పలు కూరగాయలు, పండ్లను శిబిరంలో ప్రదర్శించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.ఎ స్.వి.ప్రసాద్, హెల్త్ విజిటర్ ఆర్.వెంకటలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ కె.ఎస్.ఆర్.జి.నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్లు శంకర్, ఆర్.వి.వి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు సేవలందించారు. శిబిరానికి నూతలగుంటపాలెంతోపాటు సచివాలయ పరిధిలోని ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం గ్రామాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై వైద్య సేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జగదీష్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, వైఎస్ ఎంపీపీ నమ్మి మీనా, మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ గ్రామ నాయకుడు కలిగెట్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

చర్మ సమస్యకు మందులిచ్చారు



నా చర్మం చాలా కాలంగా దురదగా ఉంటోంది. ఎంత మంది వైద్యులకు చూపించినా తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చూపించాను. వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు. వ్యాధి నయమవుతుందని ఆశిస్తున్నాను.

– డి.అప్పలనాయుడు, రైతు, నూతలగుంటపాలెం

బీపీ పరీక్షలు చేశారు



బీపీతో బాధపడుతున్నాను. తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో బీపీ పరీక్షలు నిర్వహించారు. బీపీ ఎక్కువగా ఉందన్నారు. మందులు ఇచ్చారు. ఉచితంగా వైద్య సేవలందించడం సంతోషంగా ఉంది.

– కాయల రమణ, రైతు, అచ్యుతాపురం

ఉచిత వైద్యం ఆనందకరం



నా శరీరంపై మచ్చలు ఉన్నాయి. అవి తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నాను. వైద్యులు ఉచితంగా మందులు ఇచ్చి తగ్గిపోతాయన్నారు. ఆనందంగా ఉంది.

– దండిన గౌరి, నూతలగుంటపాలెం

పేదల ఆరోగ్యానికి భరోసా



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో నర్సింహారావు

- గోపాలపురంలో 286 మందికి వైద్య సేవలు

అనకాపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చారని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని గోపాలపురం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు, రోగిని ఆన్‌లైన్ నమోదు చేయడం వంటి కార్యక్రమాలను పరిశీలించారు. అక్కడే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన సందర్శించారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను ఎంపీపీ కోరారు. సురక్ష శిబిరంలో 286 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 13 మందిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేయగా, 9 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జర్రిపోతుల లక్ష్మి, ఎంపీడీవో కె.నరసింహరావు, వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

వైద్య సేవలతో ఆనందం



మా బాగోగులు పట్టించుకునే ముఖ్యమంత్రిని ఇప్పుడే చూస్తున్నా. నాకు 68 ఏళ్లు. ఏ మాత్రం చిన్నపాటి ఆరోగ్య సమస్య ఏర్పడినా పట్టణానికి పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్ జగన్ ప్రభుత్వం గ్రామంలోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తమకు వైద్య సేవలందించడం ఆనందంగా ఉంది.

– జి.దొంగబాబు, గోపాలపురం

పల్లె చెంతకే వైద్యంతో భరోసా



నా వయస్సు 53 ఏళ్లు. శరీరం జోగుతోంది. ఈ సమస్యపై పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయానికి వెళ్లాలనుకున్నా. ఈలోగా తమ గ్రామంలో వైద్య శిబిరం ద్వారా అన్ని వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారని తెలిసింది. అక్కడికి వెళ్లగా.. వైద్యులు అన్ని పరీక్షలు చేసి బీపీ ఉందని చెప్పి, ఉచితంగా మందులు అందించారు.

– వరలక్ష్మి, గ్రామస్తురాలు

శరవేగంగా జగనన్న గృహాల నిర్మాణం



కోడూరు-1 లేఅవుట్‌లో జగనన్న గృహాలను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతిటి కల నెరవేరుతోందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలోని కోడూరు-1 లేఅవుట్‌లో జగనన్న కాలనీ గృహాల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహ కాలనీల పనులు శరవేగంగా సాగుతున్నాయని, సంక్రాంతిలోగా పూర్తిచేసి ప్రజలు గృహప్రవేశం చేసేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఇళ్లతో పాటు రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ వంటి పనులు ప్రారంభానికి కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో మరో 1,300 గృహాలు మంజూరయ్యాని, జియో టాగింగ్ కూడా పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రజలు వారివారి ఇళ్లు ఏ విధంగా ఉంటాయో తెలుసుకునేందుకు కొన్ని మోడల్ ఇళ్ల నిర్మాణాన్ని కూడా చేపట్టమని కాంట్రాక్టర్‌ను కోరినట్లు తెలిపారు. 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పార్టీ నేతలు బొడ్డపాటి చిన్నరాజారావు, విల్లూరి శేఖర్, వామల కాశీ, జె.ధర్మారావు, ఇంటి త్రినాథ్, కోటిపల్లి శ్రీను, మళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 4 నుంచి మాలధారణ దీక్షలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహలక్ష్మీ స్వామి మాలధారణ దీక్షలు డిసెంబర్ 4 నుంచి ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం మాలధారణ దీక్ష కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. 41 రోజులు దీక్ష చేపట్టిన భక్తులు భోగి పండగతో ముగుస్తుందని, గోదాదేవి కల్యాణం అనంతరం సింహాచలం లక్ష్మీనృసింహ స్వామివారిని దర్శించుకొని దీక్ష విరమిస్తారన్నారు. డిసెంబర్ 3న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, మద్దాల కృష్ణ, కాండ్రేగుల రాము పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం అప్పారావు, మూర్తి

కశింకోట: జిల్లాలోని కశింకోట, మునగపాక హైస్కూళ్లలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్-2023(ఎన్‌ఎంఎంఎస్) కోసం నిర్వహించే పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 22 వరకు స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తామని వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.వి.ఎస్.మూర్తి తెలిపారు. ఈ మేరకు రూపొందించిన కరపత్రాన్ని స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎం.ఆర్.వి.అప్పారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ఈ రెండు కేంద్రాల్లో జరిగే శిక్షణ కార్యక్రమంలో ఎక్కడైనా పాల్గొన వచ్చునన్నారు. దీనిలో చేరడానికి విద్యార్థులు 70139 12153 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి వరుసగా నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. హెచ్‌ఎం అప్పారావు మాట్లాడుతూ 14 ఏళ్లగా స్పందించే హృదయం సంస్థ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరావు, ఉపాధ్యాయులు ఆచంట రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు



పతకాలు సాధించిన విద్యార్థులతో జానకీరామరాజు, జాజుల రమేష్‌లు

అనకాపల్లిటౌన్: విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ఏదో ఒక క్రీడలో పాల్గొని, తమ ప్రతిభను పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కేఎస్‌వీ సత్యనారాయణ సూచించారు. స్థానిక వేల్పులవీధి ఎస్‌కేపీ వ్యాయామశాలలో విశాఖ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌కు ఉపకరించే క్రీడలను ఎంచుకోవాలని సూచించారు. స్కూల్ గేమ్స్ విజేతలకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ చేతుల మీదుగా పతకాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామశాల అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, శిక్షకులు కె.శ్రీనివాసరావు, రాము, నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కన్వీనర్ నర్సింహం, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని ఎంపీ బీవీ.సత్యవతి అన్నారు. స్థానిక గాంధీనగరం బీసీ, ఎస్సీ వసతి గృహాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.15 లక్షల చొప్పున రెండు వసతి గృహాల అభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు చేశామన్నారు. రాంకో సిమెంట్ సీఎస్ఆర్ నిధులు మంజూరైనట్లు చెప్పారు. బీసీ వసతి గృహాల విద్యార్థులకు సామగ్రి భద్రపరిచేందుకు 100 ట్రంకుపెట్టెలను రోటరీ సంస్థ ద్వారా త్వరలో అందిస్తామని తెలిపారు. వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీ ఆకాంక్షించారు. సీఎస్ఆర్ నిధులు మంజూరుకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు వసతిగృహాల అభివృద్ధి ఖర్చు చేస్తామన్నారు. అంతకుముందు విద్యార్థుల నుంచి పలు ప్రశ్నలకు జవాబులు రాబట్టారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, బీసీ, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారులు సురేష్, కుమార్, సత్యవతి, పార్టీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వాడవాడలా గుడివాడ గురునాథరావు జయంతి



కన్నూరుపాలెంలో గురునాథరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రాజు తదితరులు



గోపాలపురంలో గురునాథరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

కశింకోట: మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు జయంతి కార్యక్రమం బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలంలోని కన్నూరుపాలెంలో గురునాథరావు విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ఎస్.శివ, ఎంపీటీసీ సభ్యురాలు కె.అచ్చియ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

- ఉగ్గినపాలెంలో గురునాథరావు చిత్రపటానికి ఎంపీపీ కలగా లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ సమన్వయకర్త కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.
- కశింకోట పంచాయతీలో గుడివాడ గురునాథరావు చిత్రపటానికి సర్పంచ్ మంత్రి జయరజని పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- తాళ్లపాలెం, బయ్యవరం, నూతలగుంటపాలెం, పరవాడపాలెం తదితర గ్రామాల్లో గుడివాడ గురునాథరావు జయంతి వేడుకలు జరిపారు.

ఘన నివాళి

అనకాపల్లిటౌన్: మండలంలోని గోపాలపురంలో గుడివాడ గురునాథరావు చిత్రపటానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గురునాథరావు రాజకీయాన్ని అందిపుచ్చుకున్న తనయుడు గుడివాడ అమర్‌నాథ్ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ముందుగా కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



తుమ్మపాలలో కేక్ కట్‌చేస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు

గురునాథరావు ఆశయాల సాధనకు కృషి

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు ఆధ్వర్యంలో గుడివాడ గురునాథరావు చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ గ్రామ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సర్పంచ్ పెంటయ్యనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా గురునాథరావు ప్రజలకు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జయంతి కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పీడీ గాంధీ, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, దంతులూరి కల్యాణ్ చక్రవర్తి, పడాల గణపతి, రైతు నాయకుడు పీలా బుజ్జి, ఈవో శ్రీనివాసరావు, ఆర్టీసీ సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, వార్డు సభ్యులు తర సత్యారావు, రవ్వ భవానీ, నాగరాజు, కొయ్య భాస్కర్, కొణతాల అర్జున్ నాయుడు, యనమశెట్టి రామారావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచి అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి బి.నర్సింగరావు అన్నారు. స్థానిక గాంధీనగరం శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో బుధవారం అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడి చిన్న చిన్న తప్పిదాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినట్లయితే భయపడకుండా తమ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. విద్యుత్, గ్యాస్ సిలెండర్ల ప్రమాదాలు సంభవించే అవకాశముందని, వాటిపై దృష్టి సారిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లిటౌన్: లోక్ జనశక్తి పార్టీ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొర్లి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నెహ్రూచౌక్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా ఉపాధ్యక్షుడిగా జంగాల చలమయ్య, ప్రధాన కార్యదర్శిగా అనకాపల్లి రమణ, సహాయ కార్యదర్శిగా వై.భద్రం, కోశాధికారిగా గ్రంధి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొత్త కమిటీ పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుందని తెలిపారు.

శరన్నవరాత్రి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లిటౌన్: స్థానిక గౌరీ పంచాయతన దేవాలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఈ ఏడాది ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు చెప్పారు. ఆలయ ఆవరణలో బుధవారం నవరాత్రి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులందరూ నవరాత్రి వేడుకల్లో పాల్గోవాలని కోరారు.

ఘనంగా గౌరమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో బుధవారం రాత్రి గౌరమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కోలాటాలు, తప్పెటగుళ్లు, పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో గౌరమ్మను గ్రామంలో ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఊరేగింపు అనంతరం జాతీయ రహదారి వద్ద చెరువులో గౌరమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కరక జయరజని, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.